పురుషులకు ప్రత్యేకం

పురుషులకు కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# ఆశయాల అలలలో...

— 'తిరుమలశ్రీ'

"క్షమించండి, శాస్త్రులుగారూ! నాకీ సంబంధం ఇష్టంలేదు" అన్నాడు విశ్వేశ్వర్రావు.

"కాస్త నిదానంగా ఆలోచించండి బాబూ! ఇది అన్ని విధాలా తమకు తగిన సంబంధం. వరుడు బుద్ధిమంతుడు. బ్యాంక్‌లో ఆఫీసరు. తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు కూడాను...." అంటూన్న శాస్త్రులు మాటలకు అడ్డు తగులుతూ, "అన్నీ బాగానే వున్నాయి. శాస్త్రులుగారు! వాటితో పాటే కట్నం తీసుకోవాలన్న ఆశపోతుతనం కూడా వున్నది కదా వాళ్లకు" అన్నాడు విశ్వేశ్వర్రావు.

"అలా అనకు బాబూ! అమ్మాయి వాళ్లకు నచ్చింది. అది ముఖ్యం మనకు. కట్నానికేముంది? ఇవ్వడం, పుచ్చుకోవడం లోకరీతే కదా! అయినా వాళ్లూ మరీ ఎక్కువ అడగడం లేదాయె. యాభైవేలంటే అబ్బాయి హోదాకు బాగా తక్కువేమరి. అయినా అమ్మాయి అందచందాలు, వినయము-అణుకువ నచ్చడంతో ఏదో లాంఛనంగా ఆమాత్రంతోటే సరిపెట్టారంటే.... బాగా ఆలోచించండి. ఎలాగో ఆసొమ్ము సరిపెట్టారంటే బంగారం లాంటి అబ్బాయి అల్లుడవుతాడు" అంటూన్న శాస్త్రులు వంక అదోలా చూసాడు విశ్వేశ్వర్రావు.

"శాస్త్రులుగారూ! నా ఆశయాలను ఎరిగివుండీ మీరిలా మాట్లాడడం ఆశ్చర్యం గొలుపుతోంది నాకు. కట్నం ఇవ్వడం, పుచ్చుకోవడం నా దృష్టిలో ఘోరాపరాధాలనీ, నీచకృత్యాలనీ మీకు తెలుసు. నాపెళ్లికి ఇస్తానన్నా కానీ కట్నం పుచ్చుకోలేదు నేను. నాకొడుక్కీ తీసుకోలేదు. అలాగే ఇప్పుడు నా కూతురికీ ఇవ్వదలచుకోలేదు. కనుక కట్నం ఆశించే నికృష్టుల సంబంధాలు దయచేసి తేవద్దు మీరు - " అంటూ ఖచ్చితంగా చెప్పేసిన విశ్వేశ్వర్రావు వంక జాలిగా, పిచ్చివాణ్ణి చూసినట్టు చూసాడు శాస్త్రులు.

"అయ్యా! పెద్దవాణ్ణి. చెబుతున్నానని కోపగించుకోకండి. మీ సంగతి తెలిసిన వాడిని కనుక అంతగా విడమర్చి చెప్పాను నేను. నేటి లోకంపోకడలో కోటి మందిలో మీరొకరు మడికట్టుకు కూర్చుంటే సమాజంలో మార్పు వచ్చేస్తుందనుకోను. అందువల్ల నష్టపోయేది మీరే. అమ్మాయికి పెళ్లి కావాలంటే కొన్ని ఆశయాలను ఒక్కోసారి త్యాగం చేయక తప్పదు...." అంటూ నచ్చజెప్పబోయాడు.

"దానినే అవకాశవాదత్వం అంటారు. ఎవరికి వారే నా ఒక్కడివల్ల ఏమవుతుంది అనుకుంటూ నలుగురూ నడిచే బాటనే నడిస్తే దేశంలోని సాంఘిక దురాచారాలు ఎలా రూపుమాసిపోతాయి? కొందరైనా ధైర్యంతో ముందడుగు వేయగలిగితే, ఆవంతైనా త్యాగం చేయగలిగితే - కొంతైనా ఫలితం చేకూరకపోదు. వీరేశలింగం పంతులు గారు, రాజారామ్మోహన్‌రాయ్ ప్రభృతులు కూడా మనలాగే అనుకున్నట్టయితే విధవా వివాహాలు జరిగేవేనా? సతీసహగమన దురాచారం రూపుమాసేదేనా? మనం ఆమహానుభావులంతటి గొప్పవారం కాకపోవచ్చును, శాస్త్రులుగారూ! కాని, మన పరిధిలో మనం చేతనైనది ఇతోధికంగా చేయగలిగినప్పుడే గదా సమాజంపట్ల మన బాధ్యత నెరవేర్చుకో గలుగుతాం?"

అతని కూతురి భవిష్యత్తు దృష్ట్యా ఏదో నచ్చజెప్పబోతే, ఆవేశంలో అంతపెద్ద వుపన్యాసం ఇచ్చిన విశ్వేశ్వర్రావును చూసేసరికి విసుగు, జాలి కూడా కలిగాయి శాస్త్రులుకి. ఇక అతనికి మంచి చెప్పబోవడం గ్రుడ్డివాడికి చీకట్లో క్రొవ్వొత్తి చూపడం వంటిదేననుకున్నాడు. అందుకే లేచినిలుచున్నాడు. అతనివద్ద సెలవు తీసుకుని, ప్రక్కనున్న చేతికర్ర అందుకుని 'హరే రామ్' అనుకుంటూ స్థూలకాయాన్ని ఈడ్చుకుంటూ మెల్లగా బయటకు నడిచాడు శాస్త్రులు.

చిన్నగా ఓ నిట్టూర్పు విడిచి వీధి అరుగుమీంచి లేచాడు విశ్వేశ్వర్రావు. ఏదో ఆలోచిస్తూ మెల్లగా లోపలికి నడిచాడు.

సావిట్లో ప్రవేశించేసరికి అప్పటివరకు వీధి గుమ్మం దగ్గర తలుపు వెనుక నిలుచుని వారి మాటలు వింటూన్న భార్య వర్ధనమ్మ నెమ్మదిగా అక్కడినుంచి తప్పుకుంది. అతని దృష్టిపథంనుంచి దాటుకోవాలని ఆమె ప్రయత్నించినా, ఆమెను చూడనే చూసాడు విశ్వేశ్వర్రావు. ఆమె విడిచిన గాఢనిశ్వసం - తీవ్రమైన ఆక్షేపణతో కూడిన నిట్టూర్పు - అతని కర్ణాలను తప్పించుకోలేకపోయింది. దాని అర్థం ఎరిగున్న అలవాటైన విశ్వేశ్వర్రావు నిశ్శబ్దంగా ప్రతినిట్టూర్పు విడవడం తప్ప ఏమీ చేయలేకపోయాడు.

అయితే - అంతలోనే గదిలోంచి వినవచ్చిన ఏడ్పు అతని కాళ్లకు బంధాలు వేసింది. మొదట సన్నగా ఆరంభమైన ఆఏడ్పు క్రమంగా స్థాయిపెంచుకుంది. ఆ స్వరం ఎవరిదో గుర్తించేసరికి తెల్లబోయాడు అతను.

అమ్మాయి ఏడుస్తోంది!?

ఎందుకు??

ఏమో!

అంతలోనే నేపథ్య వ్యాఖ్యానంలా భార్య గొంతు ఏదో గొణుగుతోంది, వినీ వినిపించకుండా.

అదంతా ఏమిటో అర్థం కాలేదు అతనికి. చావిట్లో వున్న పడక్కుర్చీవైపు నడవబోయినవాడు ఆగి, గదివైపు అడుగులు వేసాడు - అప్పుడే నడకవచ్చిన పసివాడిలా తడబడుతూ,

గదిలో — మంచంపైన బోర్లాపడి ఏడుస్తోంది కూతురు భవాని... కూతురి ప్రక్కనే కూర్చుని అనునయంగా తల నిమురుతూ సగం స్వగతంగా సణుక్కుంటోంది భార్య వర్ధనమ్మ.


ఏమయిందో, కూతురు ఎందుకు విలపిస్తోందో అంతా అయోమయంగా అనిపించింది విశ్వేశ్వర్రావుకి.

"ఏమిటమ్మా? ఏమయింది? ఎందుకా ఏడ్పు?" అనునయంగా ప్రశ్నించాడు కూతురి నుద్దేశించి.

భవాని జవాబివ్వలేదు. జవాబుగా ఏడ్పు స్థాయి మాత్రం పెరిగింది.

"ఏమయింది, వర్ధనం? అమ్మాయి దుఃఖానికి కారణమేమిటీ? ఆరోగ్యం బాగానే వుందిగదా?" ఆత్రతమిళితమైన స్వరంతో భార్యను అడిగాడు.


అంతే!... ఒక్కసారిగా, వేడందుకున్న తారాజువ్వలా తారావధానికి లేచింది వర్ధనమ్మ. "పిల్లబ్రతుక్కి ఏడ్పు కాక ఇంకేముంది గనుక! ఆడవాళ్లం అంతకంటే ఏం చేయగలం?" అంటూ తీక్షణంగా, రూక్షణంగా జవాబిచ్చింది.



"అంటే-?" మరింత అయోమయంలో పడిపోయాడతను. అంతలోనే ఏదో అనుమానం అతని మదిలో మెదిలింది.

"ఆశయాలంటూ వచ్చిన మంచి సంబంధమిలా వదులుకుంటూంటే... మీ ఆశయం నెరవేరేసరికి అమ్మాయి ముసలిదయిపోతుంది. ఇప్పటికే పాతికేళ్లు వచ్చాయి. అయిదేళ్లుగా చూసిన సంబంధం ఏదీ కలిసిరాకుంటే - కట్నం అడిగారంటూ మీరు కాలదన్నుకుంటూంటే - అడిగిన వారందరికీ బదులు చెప్పలేక నేను చస్తున్నాను. 'అన్నేళ్లొచ్చినా పిల్లకు పెళ్లిచేయదలచుకోలేదా వర్ధనమ్మా?' అంటూ అంతా ముఖంమీదే అడుగుతూంటే - నా ముఖం తీసుకెళ్లి ఎక్కడ దాచుకోవాలో తెలీక సిగ్గుతో కుంచించుకుపోవడమవుతోంది...." ఆవేదన, వుక్రోషమూ మిళితమైన గొంతు బొంగురుపోయింది వర్ధనమ్మకు.

భార్యను చూస్తే జాలివేసింది విశ్వేశ్వర్రావుకి. "ఒకరి కోసం మనం బ్రతకడంలేదు, వర్ధనం! పనీ పాటూలేని లోకులకు పరులను ఏదో వంకతో కాకుల్లా పొడవడం పరిపాటి. మనం లక్ష్యం చేస్తున్నామని తెలిస్తే మరింత బాధిస్తారు. అలక్ష్యంచేస్తున్నట్లు గుర్తిస్తే మన ప్రక్కకూడా చూడరు. ఎవరో ఏదో అన్నారని మనం బెంబేలుపడిపోనవసరంలేదు. మన ఆశయాల్ని వదులుకోనవసరం లేదు..." అంటూన్న భర్తకు మధ్యలోనే అడ్డు తగులుతూ ఆవేశంగా అంది వర్ధనమ్మ "ఔను. ఫలించని ఆశయాలతో పిల్లకు అన్యాయం చేస్తే మీకు హాయిగా వుంటుంది! వచ్చిన సంబంధమల్లా ఆశయాల పేరిట మీరు వెళ్లగొడుతూండే వూరంతా ఏమనుకుంటూందో



తెలుసా? పిల్ల సంపాదనను ఆశించి, ఆశయాల ముసుగు వేసుకుని మనం దాని పెళ్ళిచేయడం లేదని!...."

"ఆఁ ....!?" నిర్ఘాంతపోయా డతను. "అంత మాటన్నారా??"

"ఎవరో అనడమే కాదు - కొద్దో గొప్పో కట్నం ఇవ్వగలిగుండీ, కట్నం ఇవ్వడం ఆశయవిరుద్ధమంటూ చక్కని సంబంధాలను చెడగొడుతూంటే - లోకం అనుమానం నిజమేమోనని నాకూ అనిపిస్తోంది...." కక్షగా, కసిగా అన్న పలుకులకు అదిరిపడ్డాడు అతను. "వర్ధనం!" అంటూ అరిచాడు ఆవేశం పట్టలేక.

"ఉన్నమాటంటే వులుకన్నట్టు, ఎందుకలా గొంతు చించుకుంటారు? ఇదే మాటలోకం చాటున అంటూంటే మీకు తెలియడంలేదు. నేను ముఖంపైన అన్నాను కనుక ఆవేశపడుతున్నారు. కాని.... అమ్మాయి మనసులో ఏమున్నదో మీరెప్పుడైనా అడిగి తెలుసుకున్నారా? ఆశయాలంటూ ఆత్మతృప్తితో వూరేగుతున్నారేగాని ఆపిల్ల ఆపిల్ల మనోభావాలు గూర్చి మీరెప్పుడైనా ఆలోచించారా?..."

"అమ్మాయి మనసేమిటో ఎప్పుడూ చెప్పందే?"

"ఎదిగిన పిల్ల ఏమని చెబుతుంది? నాన్నా నాకు పెళ్ళిచెయ్యి అని చెబుతుందా?" అంటూ కఁయ్‌మంది వర్ధనమ్మ.

ఓ క్షణం ఆగి, "వర్ధనం! ఎవరేమనుకున్నా నాకు లెక్కలేదు. నా చిట్టితల్లి నన్ను అర్థంచేసుకుంటే చాలు" అన్నాడతను.

"మీ చిట్టితల్లి మిమ్మల్ని బాగానే అర్థంచేసుకుంది! మీ పోకడ చూసి అందరూ అనుకుంటూన్నదే సత్యమేమోనని అది అనుకోవడంలో ఆశ్చర్యమేముంది?"

భార్య అన్న మాటతో కొయ్యబారిపోయాడతను. కాసేపటికి తేరుకుని, "అంటే.... అమ్మాయి కూడా నన్ను అపార్థం చేసుకుందా?!" అన్నాడు నమ్మలేనట్టు.

"ఔను. నానాటికీ వయసు పెరుగుతూంటే, తోటి వాళ్ళు హేళనచేస్తూంటే ఎవరితో చెప్పుకోవాలో, ఏమని చెప్పుకోవాలో తెలీక తనలో తానే కుమిలి పోతోంది. తన సంపాదనను వదులు కోవడం ఇష్టంలేకనే ఏదో వంకతో సంబంధాలు చెడగొడుతున్నామేమోనన్న సందిగ్ధంతో కొట్టుమిట్టాడుతోంది...."

ఆ పలుకులు ఆలకించడంతో హతాశుడయ్యాడు విశ్వేశ్వర్రావు. "అమ్మా! భవానీ! నిజం చెప్పుతల్లీ! ఈ నాన్న నిజాయితీనే శంకిస్తున్నావా అమ్మా?" అంటూ కూతుర్ని అడిగాడు పిచ్చివాడిలా. అతని గొంతులో కంపన, సన్నటి జీర.

అంతవరకూ సన్నగా ఏడుస్తూనే వున్న భవాని, తండ్రిపలుకులతో పైకి లేచి జవాబివ్వకుండా ముఖంత్రిప్పుకుని గదిలోంచి వెళ్ళిపోయింది.

చలనరహితుడే అయ్యాడు విశ్వేశ్వర్రావు. కనీసం కూతురు అలా భావిస్తుందని వూహలో కూడా అనుకోలేదు అతను. ఒక్కసారిగా ఎక్కడలేని నీరసమూ ఆవహించింది అతన్ని. నిలుచోలేనట్టు ప్రక్కనే వున్న కుర్చీని పట్టుకుని అందులో కూలబడ్డాడు.

"వర్ధనం! నీ గుండెలపైన చేయివేసుకుని చెప్పు. ఆడపిల్ల సంపాదనకోసం అర్రులు చాచేవాడిలా, కన్న కూతురికే అన్యాయం చేసేంతటి నీచుడిలా కనిపిస్తున్నానా నేను? నా ఆశయాలు ఇప్పటివా? అవి నీవు ఎరుగవా?" దైన్యంగా అన్నాడు.

"ఆశయాలన్నవి సాగినంతవరకేనండీ! వాటివల్ల మన బిడ్డల భవిష్యత్తు నాశనమవుతుందనుకుంటే వాటినేపట్టుకుని వ్రేలాడడం మూర్ఖత్వమే అవుతుంది" గొంతు మార్చి నచ్చజెబుతున్నట్టుగా అంది వర్ధనమ్మ. "మీ ఆశయాలను మీ వరకూ పాటించడం బాగానే వుంది. కాని, వాటితో పిల్ల బ్రతుకును బుగ్గిచేసే హక్కు, అధికారమూ మీకెక్కడివి?"

"అంతేనంటావా?" బేలగా అడిగాడతను. "ఇన్నేళ్ళుగా ఏ ఆశయాల కోసమైతే పాటు పడ్డానో వాటిని స్వార్థం కోసం సడలించమంటావా? నలుగురూ నన్ను చూసి నవ్విపోరా? అవకాశవాదినని నిందించరా?"

"పాతికేళ్ళొచ్చినా కూతురికి పెళ్ళిచేయకుండా ఇంట్లో పెట్టుకుంటే మాత్రం నలుగురూ నవ్వడంలేదూ? నిదించడంలేదూ?" దెప్పిపొడుపుగా అందామె. "నేను ఇదే చెబుతున్నాను. మీ ఆశయాలతో విసుగెత్తిపోయింది నాకు. నా కూతురి జీవితం నాశనం చేసే ఆశయాలంటే నాకు గౌరవంపోయింది. అవేవో మీ వరకే పరిమితం చేసుకోండి.... ఇప్పుడు ఆ శాస్త్రులు గారు తెచ్చిన గుంటూరు సంబంధాన్ని ఖాయంచేయించేస్తాను. వాళ్ళడిగిన యాభైవేలు పుట్టించడం మనకు కష్టంకాదు. ఇవేళే అబ్బాయికి వుత్తరం రాసి రప్పిస్తాను. ఇంత మంచి సంబంధం వదులుకుంటే మళ్ళీ అలాంటిది దొరుకుతుందన్న నమ్మకంలేదు నాకు. అసలు మీధోరణి

ఎరిగున్న వారెవరూ సంబంధాలు తేవడానికి ఇష్టపడడం లేదు. ఎలాగైనా ఈ పెళ్లి జరిపిస్తాను. తండ్రిగా మీరు తప్పించుకు తిరిగినా, తల్లిగా ఆ బాధ్యత నాకుంది. మీరు కాదన్నా ఆగేదిలేదు. అంతకూ అడ్డు తగిలారంటే మాశవాలే మిగులుతాయి మీకు... ముందుగా చెప్పలేదని ఆ తరువాత నన్ను తప్పు పట్టొద్దు....'' చెప్పదలచుకున్నదేదో సూటిగా చెప్పేసి, నోట్లో చెంగు కుక్కుకుని, పొంగి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ మరోక్షణం అక్కడ వుండకుండా ఆగదిలోంచి పరుగెత్తింది వర్ధనమ్మ.

చేష్టలు వుడిగిన విశ్వేశ్వర్రావు కొయ్యతో చేసిన బొమ్మలా, శూన్య మనసుతో వెర్రిచూపులు చూస్తూ వుండిపోయాడు.

* * *

విశ్వేశ్వర్రావు ఆ మధ్యనే బడిపంతులు ఉద్యోగం నుంచి రిటైరయ్యాడు. భార్య వర్ధనమ్మ అతని కంటె అయిదారేళ్లు చిన్నది. వారి సంతానం ఇద్దరే. ముప్పయ్యేళ్ల కొడుకు భానుమూర్తి, పాతికేళ్లు కూతురు భవానీను, భానుమూర్తి ఓ కేంద్ర ప్రభుత్వ సంస్థలో అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. అయిదేళ్లక్రితమే పెళ్లయింది అతనికి. అప్పుడే ఇద్దరు పిల్లలు కూడాను. ఉద్యోగరీత్యా హైద్రాబాద్‌లో వుంటున్నాడు. 'అవుటాఫ్ సైట్ - అవుటాఫ్ మైండ్' అన్న సామెతను సార్థకం చేసాడతను. పెళ్లయాక దూరంగా వెళ్లిపోవడంతో తల్లిదండ్రుల మీద శ్రద్ధ తగ్గిపోయింద్ అతనికి. ప్రారంభంలో పంపించే తృణమో, పణమో కూడా క్రమేణా పంపడం మానేసాడు. విశ్వేశ్వర్రావు కూడా పట్నంలో నంసారం, పిల్లాడు ఏం ఇబ్బందులుపడుతున్నాడోననుకుంటూ ఎన్నడూ డబ్బుకోసం ఇబ్బందిపెట్టి ఎరుగడు. కనీసం అప్పుడప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకోవాలనిగాని, తమ శ్రేయస్సును తల్లిదండ్రులకు తెలియపరచాలనిగాని వుండనికారణంగా - ఎప్పుడోగాని వుత్తరాలు రాయడం మానివేసాడు.

భవాని బిఎస్సీ పాసయింది. రెండేళ్లుగా ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తోంది. మనిషి అందచందాలకు లోటు లేదు. అయినా కట్నపిశాచి స్వైరవిహారంచేసే భారతావనిలో ఆడదిగా జన్మించిన కారణంగా, కట్నం కోరకుండా ఆమెను పెళ్లాడేందుకు ముందుకు రాలేదెవరూ. కాకుంటే ఆమె అందానికి ప్రీమియంగా రేటు తగ్గించారు కొందరు.

అయితే విశ్వేశ్వర్రావు తాను నమ్మిన సిద్ధాంతాలకోసం, ఆశయాలకోసం జీవితాన్నే ధారబోసిన మనిషి. అందుకే జీవితంలో ఉన్నత సోపానాలను అధిరోహించగల అర్హత వున్నా అవకాశాలు వచ్చినా అందుకోలేకపోయాడు. రిటైర్‌మెంట్ వరకు బడిపంతులుగానే మిగిలిపోయాడు. ముఖ్యంగా కట్నరాక్షసికి బద్ధశత్రువు అతను. 'కట్నం తీసుకోకూడదు - ఇవ్వకూడదు' అన్న సూత్రాన్ని గాఢంగా నమ్మినవాడు కావడంతో ఆచరణలో పెట్టాడు దానిని. అంతేకాక కొందరు ఔత్సాహికులను ప్రోగుచేసి 'యాంటీ డౌరీ స్క్వాడ్'ని స్థాపించాడు. ఎక్కడ, ఎవరు కట్నం తీసుకుంటున్నట్లు తెలిసినా ఆ సంస్థ సభ్యులు వెళ్లి వారికి తగిన బుద్ధి చెప్పి పెళ్లికొడుకు మనసు మార్చి కట్నంలేకుండా దగ్గరుండి పెళ్లి జరిపి వచ్చేవారు. అలాగే, ఎక్కడైనా 'కట్నపు చావు'లు సంభవిస్తే ఆందోళన జరిపి అందుకు బాధ్యులైనవారిని శిక్షింపజేసేంతవరకు నిద్రపోయేవారుకాదు ఆ సంస్థ సభ్యులు.

ఆ సంస్థ బయట ఎంత పాప్యులారిటీ చెందినా, వర్ధనమ్మ మాత్రం భర్త చేష్ఠలను హర్షించేదికాదు. తన బ్రతుకే సరిదిద్దుకోలేని బడిపంతులు వూళ్లో బ్రతుకులు బాగుచేస్తాననని తయారవడం హాస్యాస్పదంగా అనిపించేది ఆమెకు. పిల్లలకు సయితం తండ్రి కార్యక్రమాలపైన సదభిప్రాయం ఏర్పడకపోవడం అతని దురదృష్టం!

అటువంటి విశ్వేశ్వరర్రావు... 'యాంటీ డౌరీ స్క్వాడ్' యొక్క ఫౌండర్-ప్రెసిడెంట్ అయిన విశ్వేశ్వర్రావు.... ఎట్టి పరిస్థితులలోనూ కట్నమిచ్చి కూతురి పెళ్లి చేయడమనేది అసంభవం, అనూహ్యమూను... జీవితమంతా ఆశయాల ఆచరణలో సంఘర్షణతోనే గడిపాడు. ఆశయాల అలలలో తేలియాడాడు.' ఇప్పుడు అవసానదశలో తన ఆశయాలను స్వార్థపు జ్వాలలకు ఆహుతి చేయడం-తనవల్లకాదు. ఆశయాలు తన వూపిరి. వల్లకాటికి వెళ్లేంతవరకు అవి తనలో భాగమై వుండాల్సిందే... తన ఆశయాలను అర్థం చేసుకుంటారనుకున్నవాళ్లే అంతవరకు కట్నం మూలంగా ఎన్ని సంబంధాలు -మంచి సంబంధాలు తప్పిపోయినా పెద్దగా బాధ పడలేదతను. ధైర్యంతో పరిస్థితిని ఎదుర్కొన్నాడు. ఏటికి ఎదురీదుతున్నాడు. ఏనాటికైనా కట్నం కోరని యువకుడు - భవానీకి తగినవాడు లభించకపోడన్న ప్రగాఢ విశ్వాసంతో ఎదురుచూస్తున్నాడు. అటువంటిది - ఈనాడు... సుమారు మూడు దశాబ్దాలుగా తనతో బ్రతుకును పంచుకున్న అర్థాంగే తనను ఎద్దేవా చేసింది. అపార్థం చేసుకుంది. తన చేతులలో పెరిగిన కుమార్తె తనను సరిగా అర్థంచేసుకోలేకపోయింది... అందుకే ఆవేదనగా వుంది విశ్వేశ్వర్రావుకి. మనసంతా పిండినట్లు ఏదో బాధగా వుంది.



పచ్చిమిరపకాయలు గాలిచొరని సీసాలో వేసి, దాంతో కొద్దిగా పసుపుపొడి వేసి, సీసా గట్టిగా మూసి, కిటికీ దగ్గర పెట్టండి. ఇలా వెయ్యడంవల్ల పచ్చిమిరపకాయలు పండకుండా చాలా రోజులు వుంటాయి.

భర్త కలిసిరాకపోయినా, శాస్త్రులు తెచ్చిన గుంటూరు సంబంధాన్ని ఖాయంచేసేసింది వర్ధనమ్మ. భర్తకు వచ్చిన రిటైర్మెంట్ గ్రాంట్సుకు తోడు, ఇంటిని తాకట్టుపెట్టి కొంత సొమ్ము సంపాదించి కట్నం డబ్బులు సర్దింది. కొడుకును రమ్మని రాస్తే, పెళ్లి ఖర్చులు ఎక్కడ నెత్తిమీద పడతాయోనని ఏదో సాకుపెట్టి పెళ్లి రోజుకు చేరుకుంటానని జవాబిచ్చాడు.

ఇంట్లో పెళ్లి పనులు ముమ్మరంగా జరుగుతూవున్నా తనకేమీ పట్టనట్టు అంటీ ముట్టకుండా వుండిపోయాడు విశ్వేశ్వర్రావు. ముభావంగా ఓ మూల కూర్చుంటున్నాడు... తిండీ కూడా తగ్గించివేసాడు. "మీ పరువు మర్యాదలు నావికావూ? కట్నం ఇస్తూన్న విషయం రహస్యంగానే వుంచానులెండి. మీరేమీ భయపడనవసరంలేదు.'' అన్న భార్యతో, "మనుమల్ని మభ్యపెట్టగలవుగాని, మనసును కాదుగా!'' అని జవాబిచ్చాడతను... మానసిక వ్యధకు గురి అవడంతో అతని ఆరోగ్యం కూడా దెబ్బ తింది. కూతురి పెళ్లయితే ఆ తరువాత అతనే సర్దుకుంటాడు లెమ్మనుకుంది వర్ధనమ్మ.

భర్త చూస్తే ఇలాగ! కొడుకు చూస్తే అలాగ!!

అయినా వర్ధనమ్మ అధైర్యపడలేదు. నిడదవోలు నుంచి అన్నగారిని రప్పించింది. అతని సహాయంతో అన్ని వ్యవహారాలూ చక్కపెట్టుకుంది.

పెళ్లిరోజు రానేవచ్చింది. భానుమూర్తి కుటుంబంతో ఓరోజు ముందు వచ్చాడు. తండ్రికి ఇష్టంలేని పెళ్లి జరుగుతున్నట్లు తెలిసినా, ఏమీ ఎరుగనట్లే వుండిపోయాడు అతను.

రాత్రి —
మూహూర్తపువేళ దగ్గర పడింది.

భజంత్రీలు మ్రోగుతున్నాయి.

పెళ్లికుమార్తె తండ్రి వచ్చి కాళ్లు కడగాలని పిలిచాడు పురోహితుడు. విశ్వేశ్వర్రావు ఆదరిదాపుల్లో ఎక్కడా కనిపించలేదు. పందిట్లో అంతా నోళ్లు నొక్కుకున్నారు. చెవులు కొరుక్కున్నారు.

భర్త ఏ మూలనున్నాడోనని వెదకడానికి ఇంట్లోకి వెళ్లింది వర్ధనమ్మ. కాసేపటికి పందిట్లోకి తిరిగి వచ్చింది. ఆత్రతగా ఎదురు వచ్చిన అన్నగారితో, "ఆయన ఆరోగ్యం బాగోలేదు. కాళ్లు మీ దంపతులు కడిగేయండన్నయ్యా!'' అంది గంభీరంగా... చెల్లెలి వదనంలోకి చూసాడతను. ఆమె ముఖం పీక్కుపోయివుంది. అలసటతో, మానసిక వేదనతోననుకున్నాడు. బావగారి సంగతి తెలిసినందున, కాళ్లు కడగడానికి అతను మొరాయించి వుంటాడని వూహించాడు.

బాజా భజంత్రీల మధ్య, పెద్దల అక్షింతలతో భవాని పెళ్లయి పోయింది. తతంగం పూర్తికావస్తూంటే చెల్లెలి కోసం చూసాడు వర్ధనమ్మ అన్నగారు. పందిట్లో కనిపించలేదామె. వెదుక్కుంటూ ఇంట్లోకి వెళ్లాడు.

గదిలో.... మంచం కోడుకు తల ఆనించి..... నేలపైన.... శోకమూర్తిలా.... కూర్చొని వుంది వర్ధనమ్మ.

"ఏమిటమ్మా, నివ్విక్కడ ఇలా కూర్చుంటే ఎలా? చికాకులుంటే వాటంతటవే సర్దుకుంటాయి. కూతురి పెళ్లయిపోయినందుకు సంతోషించాలిగ్గాని ఇలా విచారంగా కూర్చుంటారా ఎవరైనా? లే'' అంటూన్న అన్నగారి చేతిలో ఓ కాగితం పెట్టి భోరుమందామె ఆమె నెత్తి మీద ఆకాశం బ్రద్దలయింది. ఆమె కళ్లు కుండపోతలు కురిసాయి.

విషయం అర్థంకాక, అయోమయంతో, కంగారుగా ఆ కాగితం విప్పాడతను. విశ్వేశ్వర్రావు భార్యకు వ్రాసిన వుత్తరం అది —

'వర్ధవం! ఆశయ పథంలో ఇన్నేళ్ల సంఘర్షణ అనంతరం ఈనాడు నావారి చేతులలోనే చిత్తుగా వోడిపోతానని ఎన్నడూ వూహించలేదు నేను. ఆశయాల అలలలో చిక్కుకున్న అసహాయుడిగా ఘోరపరాజయం పొందాను. నాఇంట్లోనే నా ఆశయాలకు ఏర్పడ్డ సమాధిని నేనూ పంచుకోవడం మినహా-ఏంచేయగలను!?... ఆఖరిశ్వాసను పీల్చేముందు మీ అందరికీ నేనివ్వగలిగింది నా ఆశీర్వాదాలు తప్ప ఇంకేముంది!... చెప్పకుండా వెళ్లిపోతున్నందుకు నన్ను మన్నిస్తావు కదూ?...నీ - విశ్వం.''

ఉత్తరం చదవడం ముగియగానే చెల్లెలివంక వెర్రిగా చూసాడు అతను.

"కాళ్లు కడగడానికని ఆయన కోసం వెదుతూంటే ఈ వుత్తరం కనిపించింది. పెళ్లి ఆగిపోవడం ఇష్టంలేక అప్పుడు బయటపెట్టలేదు దీన్ని'' అంది వర్ధనమ్మ వెక్కుతూ.

అంతవరకూ కొండంతటి బాధను తనగుండెలలోనే అణుచుకున్న చెల్లెలివంక జాలిగా చూస్తూ, "ముందు నువ్వు ధైర్యం తెచ్చుకోమ్మా! బావకు ఏమీ కాకుండానే నేను వెదికి పట్టుకొస్తాను'' అంటూ అను నయించి కంగారుగా బయటకు పరుగెత్తాడతను.

కాని—

ఆశయాల అలలు నిర్దాక్షిణ్యంగా గెంటివేసిన కారణంగా — తెల్లవారేసరికి విశ్వేశ్వర్రావు మాస్టారి భౌతిక కాయం గోదావరి ఒడ్డున తేలింది.